# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in | ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం | తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 158 గుంటూరు, మంగళవారం 17- 02 - 2026 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రై కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు..




**అమరావతి, ఫిబ్రవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్):** గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ సోమవారం అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వంపై బిల్‌గేట్స్ ప్రశంసలు కురిపించారు. 'నైస్, గుడ్, గ్రేట్ ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలంటూ గేట్స్ కొనియాడారు. గేట్స్‌పై ఉన్న గౌరవంతో మంత్రి నారా లోకేశ్‌తో సహా నలుగురు మంత్రులను సీఎం చంద్రబాబు గన్నవరం విమానాశ్రయానికి పంపించి స్వాగతం పలికారు. సచివాలయంలో మొదటి బ్లాకులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబును చూడగానే కారు దిగుతూనే 'హలో ఫ్రెండ్...! హౌ ఆర్ యూ'.. అంటూ ముఖ్యమంత్రిని పలకరించారు గేట్స్. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సహా ఇతర క్యాబినెట్ మంత్రులను బిల్‌గేట్స్‌కు సీఎం చంద్రబాబు పరిచయం చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సందర్భంగా తన ఛాంబర్ లోకి వచ్చిన బిల్‌గేట్స్‌కు తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిలువెత్తు చిత్రపటాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు చూపించారు. శ్రీవారి ప్రాశస్త్యాన్ని, తిరుమల క్షేత్రం గొప్పదనాన్ని బిల్ గేట్స్‌కు వివరించారు సీఎం. గేట్స్ ఫౌండేషన్ బృందంతో బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ అనంతరం ఆర్టీజీ సెంటర్‌కు గేట్స్‌ను తీసుకెళ్లారు ముఖ్యమంత్రి. తర్వాత ఆ విభాగం పనితీరును వివరించారు. పాలనా వ్యవహారాలు, విపత్తుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే విషయంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీని ఏ విధంగా వినియోగించు కుంటున్నామనే అంశాన్ని ఉదాహరణలతో సహా వివరించారు ముఖ్యమంత్రి. గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో కుప్పంలో చేపట్టిన సంజీవని ప్రాజెక్టు ప్రోగ్రెస్‌ను ముఖ్యమంత్రి వివరించగా.. దట్స్ నైస్ అంటూ మెచ్చుకు న్నారు బిల్ గేట్స్. ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగంపై గ్రేట్ అంటూ గేట్స్ అభినం దనలు తెలిపారు.డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవలను సులభతరం చేయడంపై బిల్ గేట్స్ హర్షం వ్యక్తం చేశారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు తక్కువ ధరకే అందించ గలిగితే.. పేదలకు ఎంతో మేలు చేకూరుతు ందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అమరా వతి రాజధాని ప్రణాళికలను.. బ్లూ-గ్రీన్ కాన్సెప్ట్‌ను, అత్యాధునిక పద్ధతుల్లో ఫ్యూచర్ సిటీగా నిర్మిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. గ్రేట్‌వర్క్ అంటూ రాజధాని మాస్టర్ ప్లాన్‌ను మెచ్చుకున్నారాయన. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలాంటి ప్రణాళికలతో రాజధాని నిర్మిస్తున్నామనే విషయాన్ని వివరించారు సీఎం. రాజధాని ప్రాంతంలో మొత్తంగా గ్రీన్ ఎనర్జీనే వినియోగించే దిశగా.. ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు బిల్ గేట్స్‌కు చెప్పారు సీఎం. అనంతరం మంత్రులు, సెక్రటరీల సమావే శానికి గేట్స్‌ను తీసుకొచ్చారు సీఎం చంద్ర బాబు. ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలు, లక్ష్యాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు రావడానికి దారి తీసిన పరిస్థితులపై ఈ సమావేశంలో చర్చిం చారు. ముఖ్యమంత్రితో పాటు.. గేట్స్ కూడా నాటి ఢిల్లీ సమావేశం, సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు, అమెరికా వెలుపల తొలి డెవలప్‌మెంట్ సెంటర్ హైదరాబాద్‌లో ఏర్పాటు కావడం గురించి సమావేశంలో ఉన్న మంత్రులు, సెక్రటరీలకు వివరించారు బిల్‌గేట్స్. తొలి భేటీలోనే చంద్రబాబు విజనరీ ఆలోచనలను తాను గమనించానని బిల్‌గేట్స్ చెప్పుకొచ్చారు. అక్కడి నుంచి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లిన బిల్‌గేట్స్ బృందం.. సాగులో టెక్నాలజీ అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి ప్రశంసించారు. ప్రకృతి సాగు గురించి రైతులు, అధికారులతో చర్చించారు బిల్‌గేట్స్. అలాగే పంట ఉత్పత్తులను పరిశీ లించారు. చీడపీడలకు సంబంధించిన వివరాలు అందించే (ఆంధ్రప్రదేశ్ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం) మొబైల్ యాప్ పనితీరును పరిశీలించారు బిల్‌గేట్స్. రైతు ఫోన్ ద్వారా ఈ యాప్‌ను ఉపయోగించి పంటకు వచ్చిన తెగులును గుర్తించడమే కాకుండా... డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేసే విధానాన్ని కూడా అడిగి తెలుసుకున్నారు బిల్‌గేట్స్. వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన బిల్ గేట్స్‌కు.. రైతులు స్థానిక వంటకాలను రుచిచూపించారు.



## విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగు:

**ఢిల్లీ,ఫిబ్రవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పర్యటిస్తున్నారు. తన పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో యువనేత పాల్గొంటున్నారు. చార్లీ ఫాక్స్ ట్రాట్ ఏవియేషన్ సర్వీసెస్‌ను లోకేశ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా యువ పైలెట్ కేడట్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మీడియాతో మాట్లాడారు. విమానయాన రంగానికి ప్రపంచస్థాయి నైపుణ్యాల దిశగా కీలక ముందడుగు పడిందని తెలిపారు. అట్లాంటా పర్యటన సమయంలో ఆలోచనగా మొదలైన ఈ ప్రయాణం ఇప్పుడు నిజంగా రెక్కలు తొడుగుతోందని చెప్పుకొచ్చారు. ప్రపంచ స్థాయి ప్రతిభతో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగాన్ని శక్తివంతం చేయడానికి ఇదో పెద్ద ముందడుగని వివరించారు. యువపైలట్ కేడట్లతో జరిగిన ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. విమానయాన భవిష్యత్తుకు కొత్త ఉత్సాహం, దిశ కనిపించిందని ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.



## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..

### రెవెన్యూ శాఖలో పోస్టు పేరు మార్పు

**అమరావతి, ఫిబ్రవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల పరిమితులను సమర్థవంతంగా నిర్వహించ డానికి తీసు కుంటున్న మార్పుల్లో భాగంగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రెవెన్యూ శాఖలోని ఎమ్మార్వో కార్యాలయాల్లో పని చేసే జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు పేరును మారుస్తూ, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ గా ఉత్తర్వులు విడుదల చేసింది. ఉత్తర్వుల ప్రకారం, ఇప్పటికే ఈ పోస్టులో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక నుంచి జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ గా పరిగణిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మార్పు కారణంగా ఉద్యోగ వివరణలు, జాబ్ ప్రొఫైల్, సమర్థతా ప్రమాణాలు స్పష్టతతో గుర్తిస్తున్నట్లు తెలిపింది. ముఖ్యంగా జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ అసిస్టెంట్ గా నిర్వహిస్తున్న విధులు ఇప్పుడు జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మారాయి. రెవెన్యూ శాఖలో వర్క్ లోడును సరళతరం చేయడం, పోస్టుల మధ్య స్పష్టత, ఉద్యోగుల బాధ్యతలను సులభంగా గుర్తిం చడం ఈ మార్పు లక్ష్యంగా ఉంది. ఇది శాఖ లో పనితీరును మరింత సమర్థ వంతంగా మార్చే దిశగా పరిగణించవచ్చు.

## ఏఐ ఇంపాక్ట్ సదస్సు..

### స్పందించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 16, క్రైమ్ కౌంటర్ న్యూస్):** దేశ రాజధాని న్యూఢిల్లీ వేదికగా ఏఐ ఇంపాక్ట్ అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సు సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఈ సదస్సు ఫలితాలు ప్రగతిశీల, వినూత్నమైన భవిష్యత్తును రూపొందించడంలో సహాయపడతాయని తాను విశ్వసిస్న?న్నట్లు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం.. సర్వజన హితాయ, సర్వజన సుఖాయ ( అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) అని తెలిపారు. ఈ సదస్సుకు ప్రపంచంలోని వివిధ దేశాధినేతలు, పలు పరిశ్రమల అధిపతులు, పరిశోధకులు, సాంకేతిక ఔత్సాహికులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.కృత్రిమ మేథస్సు(ఏఐ)పై సదస్సు ఆ రోజు అంటే.. సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. ఈ సదస్సుకు ప్రపంచ నేతలు, ప్రముఖ టెక్ కంపెనీల సీఈఓలు, వేలాది మంది ప్రతినిధులు దేశ రాజధాని న్యూఢిల్లీకి వచ్చారు. ఈ నేపథ్యంలో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు జరిగే ప్రదేశంతోపాటు పరిసర ప్రాంతాల్లో వేలాది మంది పోలీసులను మోహరించారు. ఈ సదస్సుకు హాజరవుతున్న ప్రముఖల జాబితాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా, గూగుల్ సీఈఓ సుందర్ పిచ్చాయి తదితరులు ఉన్నారు.

అలాగే యూరప్, ఆసియా దేశాలకు చెందిన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ సదస్సుకు తరలి వచ్చారు. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు 1.5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ సమావేశాల్లో ఇది అతి పెద్దదని చెబుతున్నారు. ఈ సదస్సు ఫిబ్రవరి 20వ తేదీ వరకు జరగనుంది.

## ఏపీ అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కీలక మలుపు: పవన్ కల్యాణ్

**అమరావతి, ఫిబ్రవరి 16 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్‌గేట్స్ పర్యటన రాష్ట్రానికి ప్రాముఖ్యతను తెచ్చిపెట్టింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సామాజిక మాధ్యమం ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ పెట్టారు. అమరావతి పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్‌కు.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ఆత్మీయ స్వాగతం పలకడం ఆనందంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి బిల్‌గేట్స్‌కు ఆత్మీయ స్వాగతం పలకడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పేదరిక నిర్మూలన వంటి రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ చేస్తున్న

2 లో



## ఏపీ అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం కీలక మలుపు: పవన్ కల్యాణ్

సేవలు విశేషమని పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యానికి చూపుతున్న నిబద్ధతను పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ భాగస్వామ్యం కీలక పాత్ర పోషించబోతోందని పేర్కొన్నారు. విద్యారంగంలో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యం విద్యార్థులకు ఆధునిక విద్యను అందించడంలో సహాయపడుతుందని పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ ఆధారిత విద్య, డిజిటల్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన వంటి విధానాలు విద్యార్థుల నైపుణ్యాలను పెంచడంలో కీలకంగా ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంలో కూడా ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని చెప్పుకొచ్చారు. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్ సహకారం ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో కీలక పాత్ర పోషించబోతోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. గేట్స్ ఫౌండేషన్ అనుభవం రాష్ట్రానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను విస్తరించడం, టెక్నాలజీ ఆధారిత ఆరోగ్య సేవలను అందించడం వంటి అంశాల్లో భాగస్వామ్యం కీలకమని అన్నారు.



శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తనపల్లి ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లకు కండక్టర్లకు వి ఆర్ ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజిల్స్ టోపీలను డిపో మేనేజర్ నాగమణి పంపిణీ చేశారు సమస్త నిర్వాహకులు తన్నీరు విజయలక్ష్మి దేవిని ఆమె అభినందించారు కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఫాతిమా రాయల్ బాబు ఎలమంద జవహరు యేసయ్య కంపెనీ సీఈఓ సుభాని తదితరులు పాల్గొన్నారు సమస్త ఆధ్వర్యంలో చిలకలూరిపేట డిపోలో కూడా విజిల్స్ టోపీలను పంపిణీ చేశారు

## చంద్రబాబుతో శివరాత్రి ఉత్సవాలలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు నియోజకవర్గం :** మహా న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మరియు పెదకూరపాడు నియోజకవర్గ సభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఎన్నికలా? పొడిగింపా?

**క్రైమ్ కౌంటర్ న్యూస్):** విజయనగరం రూరల్, ఫిబ్రవరి 16 గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఐసీ (పర్సన్ ఇన్‌చార్జి)లను ప్రభుత్వం కొనసాగిస్తుందా? తాజాగా ఎన్నికలు నిర్వహిస్తుందా? అన్న దానిపై స్పష్టత కరువైంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాకపోవడంతో పశు సంవర్ధక శాఖాధికారులు తర్జన, భర్జన పడుతున్నారు. విజయనగరం జిల్లాలో 87 సంఘాలు, పార్వతీపురం మన్యంలో 33 సంఘాలు ఉన్నాయి. వీటి పాలకవర్గాల పదవీ కాలం గత ఏడాది జూన్, 23తో ముగిసింది. పాలకవర్గాల స్థానంలో పీఐసీలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం పీఐసీలు ఆరు నెలల పాటు ఉంటాయి. వాటి గడువు గత నెల 22తోనే ముగిసింది. మరోసారి గడువు పెంచుతూ కాని, ఎన్నికలు నిర్వహించాలన్న దానిపై కాని ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాలేదు.

జిల్లా స్థాయిలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘ అధ్యక్షుడి పదవీ కాలం ముగియడంతో అప్పటివరకు అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన మన్యాల కృష్ణనే తిరిగి పీఐసీగా నియమించారు. గత నెల 22తో పీఐసీ గడువు ముగిసింది. పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలం ముగిసిందని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ప్రకారం ముందుకువెళ్తామని లిఖితపూర్వకంగా, మౌఖికంగా కూడా పశు సంవర్ధకశాఖాధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు వివరించారు. గత నెల 20నే విజయనగరం జిల్లా పశు సంవర్ధకశాఖాధికారులు ఫైల్ పంపినా ఇంత వరకూ సమాచారం రాలేదు.– క్షేత్రస్థాయిలో గొర్రెల పెంపకందారుల సహకార సంఘ ఎన్నికలకు సంబంధించి పశు సంవర్ధకశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు నిర్వహించాలంటే ప్రతి సంఘం నుంచి రికార్డులు జిల్లా పశు సంవర్ధకశాఖ కార్యాలయానికి చేరాలి. ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి 120 సంఘాలకు గాను ఇప్పటి వరకూ 90 శాతం సంఘాలకు సంబంధించిన వివరాలు, రికార్డులు అందాయి. మిగతా పది శాతం రావాల్సి ఉంది. ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయం మేరకు అధికారులు ముందుకు వెళ్లనున్నారు.

## అన్నం పరబ్రహ్మ స్వరూపం



**బిక్కవోలు క్రైం కౌంటర్ ఫిబ్రవరి 16** అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడం అంటే ఆ పరమాత్మ కు సేవచేసినట్లే.జీవుడి ఆకలిలోనే దేవుడు ఉంటాడు. అందుకే అన్నంపెట్టే వారిని అన్నపూర్ణదేవి అంటారు. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామంకు చెందిన శ్రీ కర్రి పణిశ్వర వంశీ కిరణ్ రెడ్డి శ్రీమతి నవ్య వర్షిత దంపతులు ఈ రోజు సోమవారం బలభద్రపురం కె అర్ కె సంక్షేమ చారిటి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యం జరుగుతున్న అన్నదానం లో పాల్గొని మూడు పూటలా నిరుపేదల ఆకలి తీర్చి వారిని ఆదుకొన్నారు. ఈ అన్నదానం లో పాల్గొని ఆకలి తీర్చుకొన్న వృద్ధులు అన్నదాత సుఖీభవ అని వంశీ వర్షిత లను ఆశీర్వదించారు.ఎదుటి వారి ఆకలి తీర్చడం అనే సంకల్పం అందరికి ఉండదు. జ్ఞానవంతులకు మాత్రమే ఈ ఆలోచన ఉంటుంది.ఏ దానం చేసినా ఎంత ఇచ్చినా దానం తీసుకొనే వారికి తృప్తి ఇవ్వలేము. ఇంకా ఇస్తే వీరికి వచ్చిన నష్టం ఏంటీ అంటారు. కానీ అన్నదానం లో ఇక చాలు అనే మాట వినబడుతుంది. భోజనం స్వీకరించిన వారు తృప్తిగా అన్నదాత సుఖీభవ అని అంటారు.ఈ రోజు కె అర్ కె ట్రస్ట్ అన్నదాన కార్యక్రమం లో సాయం అందించి ఎందరికో ఆకలి తీర్చిన వంశీ వర్షిత లకు ట్రస్ట్ చైర్మన్ కర్రి రామ కృష్ణా రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటున్న స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్



**క్రైం కౌంటర్ కోటేశ్వరరావు పెద్దకూరపాడు న్యూస్ :** స్ఫూర్తి ఫౌండేషన్ ఇప్పుడు ఈ పేరు సమాజంలో గట్టిగా వినపడుతుంది ఎందుకంటే పౌండేషన్ చేసే కార్యక్రమాలు అలాంటివి. పెదకూరపాడు మండలం పొడపాడు గ్రామనకు చెందిన కుమ్మరి గాబ్రియేలు లారీ ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయి నడవలేని పరిస్థితుల్లో స్ఫూర్తి ఫౌండేషన్ వారి గురించి తెలుసుకొని మూడు చక్రముల సైకిల్ కొరకు స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి శివ ప్రసాద్ ని కలిసి సహాయం అడిగారు అలాగే పెదకూరపాడు గ్రామంలో చెందిన అనుముల రంగస్వామి రెండు కాళ్లు పనిచేయలేని పరిస్థితుల్లో స్ఫూర్తి ఫౌండేషన్ గురించి తెలుసుకొని ప్రతినిధి శివప్రసాద్ ని కలిసి అతను పడుతున్న బాధని విన్నవించుకున్నాడు ఈ విషయాన్ని స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ కి తెలియపరచుగా వెంటనే వారికి కావలసిన మూడు చక్రముల సైకిల్ ఏర్పాటు చేసి వారి యొక్క దాతృత్వము చాటుకున్నారు ఈ సందర్భంగా ఆ వికలాంగులు మరియు ఆయా గ్రామముల ప్రజలు స్ఫూర్తి ఫౌండేషన్ వారిని వారి సేవలను కొనియాడారు

## గ్రీవెన్స్ నిర్వహించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు తాడికొండ నియోజకవర్గం :** గుంటూరు జెకెసి కాలేజీ రోడ్డులో ఉన్న తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ పలువురి అర్జీదారుల సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కారం చేశారు

## ముటుకూరు యస్సీ కాలనీలో ఘనంగా పిఆర్కె జన్మదిన వేడుకలు.





**క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం.** పల్నాడు జిల్లా అధ్యక్షులు మాచర్ల మాజీ శాసనసభ సభ్యులు రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను స్థానిక ముటుకూరు ఎస్సీ కాలనీ లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్సిపి నాయకులు ముందుగా పిఆర్కే చిత్రపటానికి పాలాభిషేకం చేసి,కేకును కట్ చేశారు.పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు పులిహోర ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కు భగవంతుడు ఆయురా రోగ్యాలతో పాటు మంచి జీవితాన్ని ప్రసాదించాలని,పిఆర్కె జైలు నుంచి త్వరగా విడుదల కావాలన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సిపి నాయకులు,కార్యకర్తలు, మహిళలు,అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో కనుల పండువగా రథోత్సవం

### స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం
### వైభవంగా కొనసాగిన మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు



**క్రైమ్ కౌంటర్ న్యూస్):** శ్రీశైలం, ఫిబ్రవరి 16 ముక్కంటీశుని ఆలయం భక్తజన సాగరమయ్యింది. కైలాసాన్ని శ్రీగిరి వీధులు తలపించాయి. శంభో శంకర.. హరహర మహాదేవ అంటూ శివభక్తులు చేసిన నామస్మరణతో శ్రీశైల క్షేత్రం మార్మోగిపోయింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా తొమ్మిదో రోజైన సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపిం చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను మేళతాళాలతో గంగాధర మండపం వద్దకు తీసుకునివచ్చి ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులనుజేశారు. రథాంగపూజలు, రథాంగ హోమం, రథాంగబలిలో గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, అన్నము రాశులగాపోసి కుంభాన్ని సాత్వికబలిగా సమర్పించి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన వీధిలో జరిగిన రథోత్సవంలో వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. రథోత్సవంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడంతో సకల పాపాలు తొలిగి కోరిన కోరికలు నెరవేరుతాయని ఆలయ స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు భక్తులకు వివరించారు. రథోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్ పర్యవేక్షించారు.

సరస్వి పుష్కరిణిలో తెప్పోత్సవం

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవాన్ని నిర్వహించారు. విద్యుద్దీపకాంతులతో ప్రత్యేక అలంకారాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కళాకారుల నృత్యాలు, డప్పు చప్పుళ్లు, సంప్రదాయ స్వాగత నృత్యాలతో ఆలయ పుష్కరిణి వద్దకు చేరుకున్న స్వామి, అమ్మవార్లకు తెప్పపై ఆశీనులజేసి షోడశోపచార పూజా క్రతువులు జరిపించారు. సరస్వి పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలుగా తిరుగుతూ తెప్పోత్సవాన్ని వైభవంగా జరిపించారు. కార్యక్రమంలో డీఐజీ కోయ ప్రవీణ్, కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షెరాన్, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు, డీఎస్పీ రామాంజినాయక్, ఎడిటర్ అనిల్‌కుమార్, సీఐ గంగనాథ్ జీవన్‌బాబు తదితరులు ఉన్నారు.

# కంభంపాడు గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్ 44వ రోజు






**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెదకూరపాడు న్యూస్ :** పెదకూరపాడు మండలంలోని కంభంపాడు గ్రామంలో వంద రోజులు 100 గ్రామాలు కార్యక్రమంలో భాగంగా ఈరోజు 44వ రోజు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ గారు కంభంపాడు గ్రామంలో గ్రామ సభ నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య గ్రామ టిడిపి సీనియర్ నాయకులు మాదినేని సుబ్బయ్య మద్దిరాల గంగాధర్ గ్రామ పార్టీ అధ్యక్షులు అర్తిమళ్ళ వెంకటకృష్ణ మార్కెట్ యార్డు డైరెక్టర్ దుప్పటి బాలకృష్ణ పెనుముచ్చు రామకృష్ణ దుప్పటి లక్షణ ఆర్తి మల్ల శ్రీనివాసరావు కాంద్రు పద్మలత ఏటుకూరి సురేష్ మాదినేని వెంకట్రావు షేక్ ముంతాజ్ గంగినేని లీలావతి సరిపూడి కృష్ణకుమారి మరియు గ్రామ టిడిపి నాయకులు అర్తిమళ్ళ వెంకటేశ్వర్లు దుప్పటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# నూతన మసీదును సందర్శించిన ఎమ్మెల్యే కన్నా





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు సత్తెనపల్లి నియోజకవర్గం :** సత్తెనపల్లి పట్టణం నందు నూతనంగా నిర్మించిన మస్జీద్ ఈ బిలాల్ ను సందర్శించి అనంతరం మసీద్ లో ప్రత్యేక నిర్వహించిన మాజీ మంత్రి వర్యులు శాసన సభ్యులు కన్నా లక్ష్మి నారాయణ ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న మత పెద్దలు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న జూనియర్ కోడెలా






**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పల్నాడు జిల్లా :** శ్రీకృష్ణదేవరాయ కాపు సత్రంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో డా. కోడెల శివరామ్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్రం కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కాపు కులస్థులందరికీ కోడెల అందించిన గొప్ప బహుమానం మా సత్రమే అని తెలిపారు. వారి కృషి, దూరదృష్టి వలన భక్తుల కోసం సౌకర్యవంతమైన వసతి గదులు, కళ్యాణమండపం, విశాలమైన అన్నదాన ప్రాంగణం ఏర్పాటు చేయగలిగామని ఆనందం వ్యక్తం చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో ఏర్పాటైన ఈ సత్రం సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షిస్తూ, అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కోడెల శివరామ్ పేర్కొన్నారు.

# అసిస్టెంట్ కమిషనర్ కుమార్తె వేడుకల్లో పాల్గొన్న ఎం.ఎల్.ఏ నక్కా ఆనంద్ బాబు





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు గుంటూరు జిల్లా :** కేంద్ర జి.ఎస్.టి, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ జిట్టా వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ రిసెప్షన్ లో మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనంద్ బాబు పాల్గొన్నారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు లోని వి.ఎ.ఆర్ గార్డెన్స్ లో సోమవారం జరిగిన కళ్యాణ వేడుకలో నూతన వధూవరులు హ్రితిక్, నిశ్చల ను నక్కా ఆనంద్ బాబు ఆశీర్వదించారు. వరుడు తండ్రి గూడపాటి రవి ప్రసాదరావు రాష్ట్ర జి.ఎస్.టి అధికారి కావడంతో..వేడుక ప్రాంగణమంతా స్టేట్, సెంట్రల్ జిఎస్టి అధికారులతో కళ కళ లాడింది. ఈ సందర్భంగా పలువురు ఐ.ఎ.ఎస్, ఐ.ఆర్.ఎస్ ఉన్నతాధికారులు, విశ్రాంత అధికారులు కొత్త జంట ను దీవించారు.

# బొత్స సత్యనారాయణకు కిరాక్ ఆర్పీ క్షమాపణలు, మళ్లీ ట్విస్ట్.



**ఫిబ్రవరి 16 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు కిరాక్ ఆర్పీ క్షమాపణలు చెప్పారు. తాను ఎవరినీ కించపరచలేదని.. అయినప్పటికీ బొత్స సత్యనారాయణ కు, ఆయన అభిమానులకు క్షమాపణలు చెప్తున్నానని అన్నారు. "బొత్స సత్యనారాయణ మీద చేసిన నేను చేసిన వీడియో ఆయనను, ఆయన అభిమానులను బాధపెట్టినట్లు తెలిసింది. నేను తీవ్రంగా చింతిస్తున్నా. నేను వ్యక్తిగత విమర్శలు చేయలేదు. నేను బూతులు తిట్టలేదు. బాడీ షేమింగ్ చేయలేదు. ఏ సామాజికవర్గాన్ని కూడా లక్ష్యంగా చేసుకుని నేను మాట్లాడలేదు. సీఎం చంద్రబాబు నాయుడును అంబటి రాంబాబు బహిరంగంగా దుర్భాషలాడిన తీరును వెనుకేసుకువచ్చిన పద్ధతి నచ్చక.. ఇమిటేట్ చేశా. అంతేకానీ తీవ్రమైన ఆరోపణలు చేయలేదు. ఏదేమైనా బొత్స సత్యనారాయణ గారికి క్షమాపణలు తెలియజేస్తున్నా. " అని కిరాక్ ఆర్పీ వీడియో విడుదల చేశారు.

అయితే ఇదే సమయంలో వైసీపీ పై కిరాక్ ఆర్పీ విమర్శలు గుప్పించారు. కేవలం ఇమిటేట్ చేసినందుకే వైసీపీ వాళ్లు ఇంత బాధపడినప్పుడు.. వైసీపీ నేతలు గతంలో మాట్లాడిన మాటలకు కూడా క్షమాపణలు చెప్పాలని కిరాక్ ఆర్పీ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే గతంలో చంద్రబాబును ఉద్దేశించి సీదిరి అప్పలరాజు చేసిన వ్యాఖ్యల వీడియోను చూపించారు. అలాగే టీడీపీ నేత కింజరాపు అచ్చెన్నాయుడు గురించి అసెంబ్లీలో వైఎస్ జగన్ మాట్లాడిన మాటలు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణపై బియ్యపు మధుసూదన్ రెడ్డి వ్యాఖ్యలు, పీతల సుజాత గురించి రోజా వ్యాఖ్యలు చేశారంటూ కిరాక్ ఆర్పీ వీడియోలు చూపించారు. బొత్స సత్యనారాయణకు తాను క్షమాపణలు చెప్పిన నేపథ్యంలో.. ఆయన కూడా వీటన్నింటికీ వైసీపీ నేతలతో క్షమాపణలు చెప్పాలని కిరాక్ ఆర్పీ డిమాండ్ చేశారు.

మరోవైపు చంద్రబాబుపై అంబటి రాంబాబు వ్యాఖ్యలపై స్పందిస్తూ కిరాక్ ఆర్పీ మాట్లాడారు. ఈ క్రమంలోనే బొత్స సత్యనారాయణను ఇమిటేట్ చేశారు. అయితే ఇది కాస్తా వివాదాస్పదమైంది. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను కిరాక్ ఆర్పీ అవమానించారంటూ వైసీపీ శ్రేణులు, కార్యకర్తలు భగ్గుమన్నారు. సోషల్ మీడియా వేదికగా కిరాక్ ఆర్పీపై విరుచుకుపడ్డారు. మల్లేశ్వరి వంటి నేతలు కిరాక్ ఆర్పీకి వార్నింగ్ కూడా ఇచ్చారు. నోరుంది కదా అని ఇష్టానుసారం మాట్లాడితే.. 2029 తర్వాత ఆలయాల వద్ద అడుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందంటూ తీవ్రంగా హెచ్చరించారు. ఈ పరిణామాల నేపథ్యంలో బొత్స సత్యనారాయణకు క్షమాపణలు చెప్పిన కిరాక్ ఆర్పీ.. ఆ తర్వాత టీడీపీ నేతలకు కూడా వైసీపీ వాళ్లు సారీ చెప్పాలంటూ డిమాండ్ చేశారు.

# బిల్ గేట్స్ అమరావతి సందర్శన.. సీఎం చంద్రబాబుతో కీలక భేటీ



**క్రైం కౌంటర్ న్యూస్ ఫిబ్రవరి 16:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో ఐటీ మంత్రి నారా లోకేశ్‌తో పాటు పలువురు మంత్రులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తర్వాత రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో సహా ఇతర మంత్రులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయనతో స్నేహపూర్వక భేటీ జరిగింది.

సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ను బిల్ గేట్స్ సందర్శించారు. అక్కడ పరిపాలనలో సాంకేతికత వినియోగం, డేటా లేక్, వాట్సాప్ గవర్నెన్స్ వంటి ఆధునిక విధానాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజలకు అందుతున్న సేవలు, డిజిటల్ గవర్నెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న పురోగతిని వివరించారు. బిల్ గేట్స్ ఈ చర్యలపై ప్రశంసలు కురిపించారు.

అనంతరం సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రులు, అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, సాంకేతికత రంగాల్లో గేట్స్ ఫౌండేషన్‌తో సహకారం, 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై చర్చలు జరిగాయి. రాష్ట్రంలో జరుగుతున్న సంజీవని ప్రాజెక్టు వంటి కార్యక్రమాలపై కూడా దృష్టి సారించారు.

ఈ సందర్శన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య బలమైన భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తుందని అంచనా. బిల్ గేట్స్ రాష్ట్రంలో టెక్నాలజీ ఆధారిత పాలన, ప్రజా సేవల అభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తున్నారు.

# సినిమా



## చిరు, బాలయ్య, వెంకీలతో బ్లాక్ బస్టర్ అందుకుంది..

ఒకప్పుడు ఇండస్ట్రీలో తిరుగులేని హీరోయిన్ ఆమె.. ఎంతో మంది స్టార్ హీరోల సరసన సినిమాలు చేసి మెప్పించింది. తెలుగు, తమిళ్ , కన్నడ భాషల్లో విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. ముఖ్యంగా తెలుగులో ఎన్నో సూపర్ హిట్ అందుకుంది. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్, నాగార్జునలతో బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంది ఆ అందాల తర్వాత. పై ఫొటోలో ఉన్న చిన్నారుల్లో ఆమె ఎక్కడ ఉందో.? ఆమె ఎవరో కనిపెట్టండి చూద్దాం.! చాలా మంది హీరోయిన్స్ ఫోటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ ఉంటాయి. స్టార్ హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు సోషల్ మీడియాలో నిత్యం వైరల్ అవుతూ ఉంటాయి. ఫ్యాన్స్ తమ అభిమాన హీరోయిన్స్ ఫోటోలను నెట్టింట తెగ షేర్ చేస్తూ ఉంటారు.హీరోయిన్స్ చిన్ననాటి ఫోటోలు, లేటెస్ట్ ఫోటో షూట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ హీరోయిన్ కు సంబంధించిన స్కూల్ డేస్ ఫోటో చక్కర్లు కొడుతుంది. పై ఫొటోలో ఉన్న స్టార్ హీరోయిన్ ను గుర్తుపట్టారా.? ఒకప్పుడు ఆమె కుర్రాళ్ళ డ్రీమ్ గర్ల్. ఇప్పటికీ తరగని అందంతో దూసుకుపోతోంది ఈ ముద్దుగుమ్మ. ఇంతకూ ఆమెను కనిపెట్టారా.? ఆమె మరెవరో కాదు.. అప్పటికీ ఇప్పటికీ కుర్రాళ్లను తన అందంతో కట్టేస్తున్న వయ్యారి భామ మీన. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషలలో ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది.మీనా చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ మొదలు పెట్టింది. సినిమా ఇండస్ట్రీలో మీనా 40 ఏళ్లకు పైగా ఉన్నారు. తెలుగులో ఆమె ఎంతో మంది సూపర్ స్టార్స్ తో నటించింది. వెంకటేష్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున ఇలా చాలా మంది స్టార్స్ తో నటించింది. ఇటీవలే మీనా భర్త కన్నుమూశారు. ఇక మీనా ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. కానీ బుల్లితెరపై పలు రియాల్టీ షోలకు జడ్జీగా వ్యవహరిస్తుంది మీనా. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ఈ చిన్నది రెగ్యులర్ గా తన ఫోటోలను షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. మీనా అప్పటికీ ఇప్పటికీ అదే అందంతో.. అలానే ఉన్నారు.





## బరువు తగ్గేందుకు, ఫిట్‌గా ఉండేందుకు ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి!

సాధారణ గోధుమలతో తయారు చేసిన చపాతీలో 15 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 70-80 కేలరీలు, 3 గ్రాముల ప్రొటీన్, కొద్ది మొత్తంలో ఫైబర్ ఉంటాయి. ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది, ప్రొటీన్ జీవక్రియకు మద్దతు ఇస్తుంది. ఇంకా చపాతీని ఇతర పిండితో కలిపి తయారు చేస్తే, అది మరింత ఆరోగ్యంగా ఉంటుంది. కాబట్టి మనం ఆరోగ్యం ఉండటానికి, బరువు నియంత్రణలో ఉండటానికి రోజుకూ ఎన్ని చపాతీలు తినాలి, ఏ సమయంతో తినాలో ఆరోగ్య నిపుణుల ప్రకారం తెలుసుకుందాం.

ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి?

మీరు ఒక రోజులో ఎన్ని చపాతీలు తినాలి అనేది మీ వయస్సు, బరువు, ఎత్తు, రోజువారీ శారీరక శ్రమ, ఫిట్‌నెస్ లక్ష్యాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి ఒక భోజనంలో 2 నుండి 4 మధ్య తరహా గోధుమ చపాతీలను తినవచ్చు. దీని అర్థం రోజుకు 6 నుండి 12 చపాతీలు, కానీ ఇది పూర్తిగా వ్యక్తిగత అవసరాలు, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి 55-65 కిలోల బరువు ఉండి కూర్చొని పనిచేస్తే లేదా తేలికైన పని చేస్తే, రోజుకు 3-4 చపాతీలు సరిపోతాయి. అదే సమయంలో, 65-75 కిలోల బరువు ఉండి మధ్యస్తంగా చురుకుగా ఉండేవారు 4-5 చపాతీలు తినవచ్చు. ఎవరైనా 75 కిలోల కంటే ఎక్కువ బరువు ఉంటే లేదా కఠినమైన పని లేదా వ్యాయామం చేస్తే, వారు రోజుకు 5-6 చపాతీలు తినవచ్చు, ఎందుకంటే వారి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేస్తుంది.

బరువు తగ్గడానికి రోజుకు ఎన్ని చపాతీలు తినాలి?

సాధారణంగా, ఒక చిన్న చపాతీలో దాదాపు 80-85 కేలరీలు ఉంటాయి. ఇందులో దాదాపు 15-18 గ్రాముల కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. మీరు మధ్యాహ్న భోజనానికి దాదాపు 300-400 కేలరీలు తినాలనుకుంటే, మీరు రెండు చపాతీలు తినవచ్చు. రెండు చపాతీలు సుమారు 160 కేలరీలు, 24-30 గ్రాముల కార్బోహైడ్రేట్లను అందిస్తాయి. అదనంగా, మీరు చపాతీలతో తినే కూరగాయలు లేదా పండ్లు కూడా కొన్ని కేలరీలను కలిగి ఉంటాయి. అందువల్ల, బరువు తగ్గడానికి మీరు రోజుకు తినవలసిన చపాతీల సంఖ్య మీ మొత్తం కేలరీల అవసరాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా, బరువు తగ్గడానికి రోజుకు 3-4 చపాతీలు సరిపోతాయని భావిస్తారు.

అయితే కేవలం చపాతీల సంఖ్యను లెక్కించడం మాత్రమే సరిపోదు. మీ ప్లేట్‌లో ఎలాంటి ఆహారం ఉందనేది పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. చపాతీలను పప్పుధాన్యాలు, పెరుగు, జున్ను లేదా కూరగాయలతో కలిపి తిన్నప్పుడు, అవి శరీరానికి ప్రొటీన్, ఫైబర్, అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఇది జీర్ణక్రియను నెమ్మదింపజేయడానికి, కడుపు ఎక్కువసేపు నిండుగా ఉంచడానికి, తరచుగా ఆకలి బాధలను తగ్గించడానికి సహాయపడుతుంది. తద్వారా మీరు త్వరగా బరువు తగ్గేందుకు సహాయపడుతుంది.



## శీతాకాలంలో ఈ తప్పులు మీరూ చేస్తున్నారా?

శీతాకాలంలో ఆహారం పట్ల ఎక్కువ శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. ఈ కాలంలో సాధారణంగా చాలా మంది వేసవిలో కంటే ఎక్కువ ఆహారం తీసుకుంటూ ఉంటారు. ముఖ్యంగా వేయించిన ఆహారాలు, స్వీట్ల వినియోగం తెలియకుండానే పెరుగుతుంది. కానీ ఈ రకమైన ఆహారాలు తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ త్వరగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు కొలెస్ట్రాల్ పెరగడానికి గల కారణాలు ఏమిటి? ఈ సమయంలో ప్రజలు ఎందుకు ఎక్కువ ఆహారం తీసుకుంటారు? శీతాకాలంలో ఏ రకమైన ఆహారాలు తినకూడదు వంటి వివరాలు ఈ కింద తెలుసుకుందాం..శీతాకాలంలో కొలెస్ట్రాల్ పెంచే ఆహారాలు ఇవే..

నెయ్యి ఎక్కువగా ఉండే ఆహారాలు

ఏదైనా కూరలో నెయ్యి వేసి వేడి చేసి తినడం చాలా హానికరం. ఎందుకంటే ఇందులో చాలా సంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో నెయ్యిని పరిమిత పరిమాణంలో తీసుకోవాలి. నెయ్యి కాకుండా సమోసాలు, కచోరి, పకోడీలు వంటి వేయించిన ఆహారాలను వీలైనంత వరకు నివారించాలి. శుద్ధి చేసిన నూనెను ఎక్కువగా వాడటం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుతుంది.

రెడ్ మీట్

శీతాకాలంలో రెడ్ మీట్‌ను పెద్ద మొత్తంలో తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ఇందులో అధిక మొత్తంలో కొవ్వు, కొలెస్ట్రాల్ ఉంటాయి. కాబట్టి దీనిని మితంగా తీసుకోవాలి. మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, దీనిని తినకపోవడమే మంచిది. అలాగే శీతాకాలంలో ఎక్కువ చక్కెర తీసుకోవడం మానుకోవాలి.

శీతాకాలంలో గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయాలు

ప్రతిరోజూ 30 నిమిషాలు వాకింగ్, తేలికపాటి వ్యాయామం చేయాలి.

మీ ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలు, పండ్లను చేర్చుకోవాలి.

కనీసం నెలకు ఒకసారి కొలెస్ట్రాల్ స్థాయిలను తనిఖీ చేసుకోవాలి.

## ఆఫ్రిదికి అధికారం ఉంటేనట..

టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ 61 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ ఫలితం మాత్రమే కాదు, పాక్ క్రికెట్ పునాదులను కదిలించేలా ఉంది. టీమిండియా నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాక్ బ్యాటర్లు చేతులెత్తేయడంపై ఆ దేశ మాజీ క్రికెటర్లు నిప్పులు చెరుగుతున్నారు. బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది వంటి దిగ్గజాలపై తీవ్ర విమర్శలు రావడమే కాకుండా, వారిని జట్టు నుంచి శాశ్వతంగా తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ఈ ఓటమిపై స్పందిస్తూ చాలా కఠినమైన వ్యాఖ్యలు చేశారు. "జట్టు ఎంపికలో నా చేతిలో అధికారం ఉంటే బాబర్ అజామ్, షాదాబ్ ఖాన్, షాహీన్ అఫ్రిదిలను వెంటనే జట్టు నుంచి తప్పించేవాడిని. వారికి ఇప్పటికే చాలా అవకాశాలు ఇచ్చాం, కానీ కీలక సమయాల్లో వారు పదేపదే విఫలమవుతున్నారు. సీనియర్లు ఫలితాలను ఇవ్వనప్పుడు, బెంచ్‌పై ఉన్న యువకులను ఎందుకు ఆడించకూడదు?" అని ప్రశ్నించారు. బాబర్ అజామ్ జట్టుకు భారంలా మారాడనే అర్థం వచ్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి.

పాక్ క్రికెట్ దిగ్గజం జావెద్ మియాందాద్ మాట్లాడుతూ.. పెద్ద మ్యాచుల్లో ఆటగాళ్లకు ఉండాల్సిన క్యారెక్టర్ పాక్ క్రికెటర్లలో కనిపించలేదన్నారు. టీమ్ మేనేజ్మెంట్ తీసుకున్న ఆరుగురు స్పిన్నర్ల నిర్ణయం కూడా ఘోర తప్పిదమని ఎత్తిచూపారు. మరో మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ అయితే.. పాక్ క్రికెట్‌లో రాజకీయ జోక్యం, వ్యక్తిగత ఎజెండాల వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. బలహీనమైన జట్లపై గెలిచి గొప్పలు చెప్పుకోవడం కాదు, భారత్ వంటి జట్లపై ఆడినప్పుడే అసలు సత్తా తెలుస్తుంది. షాహీన్, బాబర్‌ల సమయం ముగిసింది అని ఆయన వేదికగా ధ్వజమెత్తారు. రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఎప్పటిలాగే తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. బాబర్ అజామ్‌ను విరాట్ కోహ్లీతో పోల్చడంపై మండిపడుతూ.. కోహ్లీ తన వారసత్వాన్ని తానే నిర్మించుకున్నాడు. కానీ బాబర్ మాత్రం ఒక్క మ్యాచ్ కూడా గెలిపించలేకపోతున్నాడు. మీరు ఒక సూపర్ స్టార్?ను తయారు చేశారు, కానీ అతడికి మ్యాచ్ గెలిపించే సత్తా లేదని దుయ్యబట్టారు. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీని కూడా అసమర్థుడు అని అక్తర్ అభివర్ణించడం గమనార్హం.

పాక్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ కూడా బాబర్ అజామ్ ప్రదర్శనపై పెదవి విరిచారు. భారత్‌పై బాబర్ మరోసారి అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. బహుశా టీ20 ఫార్మాట్‌లో బాబర్‌కు ఇదే చివరి మ్యాచ్ కావచ్చేమో అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న బాబర్‌ను జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.




## రషీద్ ఖాన్ సేన నయా రికార్డు

టీ20 ప్రపంచకప్ 2026లో అఫ్గానిస్థాన్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. సోమవారం ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన కీలక పోరులో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పై 5 వికెట్ల తేడాతో రషీద్ ఖాన్ సేన ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో అఫ్గాన్లు తమ సూపర్-8 ఆశలను సజీవంగా ఉంచుకున్నారు. ఒకవేళ ఈ మ్యాచ్‌లో ఓడిపోయి ఉంటే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చేది. నిన్న భారత్ చేతిలో పాకిస్థాన్ ఓడిపోవడంతో సంబరాలు చేసుకున్న అఫ్గాన్ అభిమానులకు, నేడు తమ జట్టు గెలుపు మరింత జోష్ ఇచ్చింది. టాస్ గెలిచిన అఫ్గానిస్థాన్ జట్టు మొదట యూఏఈని బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అఫ్గాన్ పేసర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో యూఏఈ బ్యాటర్లను వణికించాడు. కేవలం 15 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి యూఏఈ నడ్డి విరిచాడు. యూఏఈ ఆటగాళ్లలో శోయబ్ ఖాన్ (68), అలీషాన్ షరాఫు (40) మాత్రమే రాణించడంతో ఆ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేయగలిగింది. ముజీబ్ ఉర్ రెహ్మాన్ రెండు వికెట్లు తీయగా, కెప్టెన్ రషీద్ ఖాన్ ఒక వికెట్ సాధించాడు.161 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన అఫ్గాన్ జట్టుకు ఆదిలోనే షాక్ తగిలింది. స్టార్ ఓపెనర్ రహ్మానుల్లా గుర్బాజ్ డకౌట్ అయి పెవిలియన్‌కు చేరాడు. అయితే మరో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్ (53) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. బౌలింగ్‌లో మెరిసిన ఒమర్జాయ్, బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించాడు. కేవలం 21 బంతుల్లోనే 40 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో మరో 4 బంతులు మిగిలి ఉండగానే అఫ్గానిస్థాన్ లక్ష్యాన్ని ఛేదించింది.

గ్రూప్-డి పాయింట్ల పట్టికలో ప్రస్తుతం సౌతాఫ్రికా వరుసగా మూడు విజయాలతో అగ్రస్థానంలో ఉండి ఇప్పటికే సూపర్-8కు అర్హత సాధించింది. రెండో స్థానంలో న్యూజిలాండ్ ఉండగా, తాజా విజయంతో అఫ్గానిస్థాన్ మూడో స్థానంలో నిలిచింది. అఫ్గాన్లు తమ తర్వాతి మ్యాచ్‌లో కెనడాపై కచ్చితంగా గెలవాల్సి ఉంటుంది. అదే సమయంలో న్యూజిలాండ్ తన చివరి మ్యాచ్‌లో కెనడా చేతిలో ఓడిపోతే, రన్ రేట్ ప్రాతిపదికన అఫ్గానిస్థాన్ సూపర్-8కు వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో ఈ గ్రూప్‌లో పోటీ ఇప్పుడు రసవత్తరంగా మారింది.గత కొన్నేళ్లుగా అఫ్గానిస్థాన్ జట్టు పసికూన స్థాయి నుంచి దిగ్గజ జట్లను ఓడించే స్థాయికి ఎదిగింది. స్పిన్ బౌలింగ్‌కు పేరుగాంచిన ఈ జట్టులో ఇప్పుడు పవర్‌ఫుల్ హిట్టర్లు, వేగవంతమైన పేసర్లు కూడా తోడయ్యారు. ముఖ్యంగా ఒమర్జాయ్ వంటి ఆల్‌రౌండర్లు జట్టుకు వెన్నెముకలా మారుతున్నారు. గ్రూప్ దశ దాటి సూపర్-8లో అడుగుపెడితే అఫ్గాన్ జట్టు ఏదైనా అద్భుతం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road.Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.